సాక్షి నిజామాబాద్

మంగళవారం • 7 • మే • 2024



బీజేపీలో పైరవీలకు తావులేదు

బీజేపీలో పైరవీలకు స్థానం ఉండదని ఎంపీ అర్వింద్ పేర్కొన్నారు. అంకాపూర్‌లో నిర్వహించిన చాయ్‌పే చర్చాలో మాట్లాడారు.

- IIలో ▸



కాంగ్రెస్ మాటకు కట్టుబడి..

అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి హామీకి కట్టుబడి ఉందని ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి తెలిపారు.

- IIలో ▸

గరిష్టం/కనిష్టం
44.4 /28.9

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రేపు సీఎం రేవంత్‌రెడ్డి రోడ్ షో



ఖలీల్‌వాడి: సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం జిల్లాలోని నిజామాబాద్ అర్బన్, ఆర్మూర్‌లో నిర్వహించనున్న రోడ్ షోల్లో పాల్గొననున్నట్లు రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్‌భవన్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం ఐదు గంటలకు ఆర్మూర్‌లో కార్నర్ మీటింగ్, సాయంత్రం ఏడు గంటలకు నిజామాబాద్ నగరంలో రోడ్ షోలో పాల్గొని కార్నర్ మీటింగ్‌లో ప్రసంగిస్తారని తెలిపారు. కార్యక్రమాలకు కాంగ్రెస్ శ్రేణులు, ప్రజలు తరలిరావాలని కోరారు.

నేడు కామారెడ్డికి కేసీఆర్

సాక్షి, కామారెడ్డి : బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికల ప్రచారంలో భాగంగా చేపట్టిన బస్సు యాత్ర మంగళవారం సాయంత్రం కామారెడ్డి పట్టణానికి చేరుకోనుంది. పట్టణంలో రోడ్‌షో నిర్వహించిన అనంతరం కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడనున్నారు. కేసీఆర్ రోడ్‌షో, కార్నర్ మీటింగ్‌లకు భారీ సంఖ్యలో జనాన్ని తరలించడానికి నేతలు ఏర్పాట్లు చేశారు.

కేసీఆర్ పర్యటన ఇలా..

కేసీఆర్ మంగళవారం సాయంత్రం 5 గంటలకు నిజాంసాగర్ చౌరస్తాకు చేరుకుంటారు. అక్కడ కేసీఆర్ బస్సు యాత్రకు బీఆర్‌ఎస్ శ్రేణులు స్వాగతం పలకనున్నాయి. అక్కడి నుంచి ప్రారంభమయ్యే రోడ్‌షో రైల్వే బ్రిడ్జి, సర్కారు దవాఖానా, ఇందిరాచౌక్, సిరిసిల్ల రోడ్డు, పొట్టి శ్రీరాములు విగ్రహం, మాయాబజార్ మీదుగా జయప్రకాశ్ నారాయణ్ చౌక్ వరకు సాగుతుంది. అక్కడ నిర్వహించే కార్నర్ మీటింగ్‌లో కేసీఆర్ మాట్లాడతారు.

విద్యుత్‌ను పొదుపుగా వాడాలి



నిజామాబాద్‌నాగారం: విద్యుత్‌ను పొదుపుగా వాడాలని ఏడీఈ టౌన్–2 తోట రాజశేఖర్ ప్రజలకు సూచించారు. విద్యుత్ భద్రత అవగాహన కార్యక్రమంలో భాగంగా సోమవారం నగరంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు ఆయన అవగాహన కల్పించారు. సెల్‌ఫోన్ చార్జింగ్ పెట్టి మాట్లాడకూడదన్నారు. విద్యుత్ పొదుపు కోసం ఫిలమెంట్ బల్బుకు బదులుగా ఎల్‌ఈడీ బల్బులను వాడాలన్నారు. ట్రాన్స్‌కో, ఆర్టీసీ సిబ్బంది సుమిత, రాజమ్మ, ఏపీ చారి, రాజయ్య, సయ్యద్ గౌస్, సంయోద్దీన్, ప్రభాకర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, రవి, సాయికుమార్, కృష్ణచరణ్ ఉన్నారు.



జిల్లా కేంద్రంలోని గాంధీ చౌక్ వద్ద కార్నర్ మీటింగ్‌లో పాల్గొన్న ప్రజలు

కార్నర్ మీటింగ్‌లో ప్రసంగిస్తున్న కేసీఆర్

బాజిరెడ్డిని గెలిపిస్తే మీకోసం పోరాడుతాడు

నిజామాబాద్ ఎంపీ అభ్యర్థిగా బాజిరెడ్డి గోవర్ధన్‌ను గెలిపించాలని.. మీకు అండగా పోరాడుతాడని కేసీఆర్ పేర్కొన్నారు. పోరాటాలు చేస్తేనే ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతాయన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను మెడలు వచ్చి అమలు చేయించేది బీఆర్‌ఎస్ పార్టీయేనని స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

అర్వింద్ నోరు తెరిస్తే అబద్ధాలే..

నిజామాబాద్ ఎంపీ అర్వింద్ నోరు తెరిస్తే చాలు అన్ని అబద్ధాలే మాట్లాడతాడని కేసీఆర్ విమర్శించారు. ఐదేళ్లలో జిల్లాకు ఒక్క నవోదయ పాఠశాల తీసుకు రాలేదన్నారు. కేవలం మతాల మధ్య చిచ్చు పెడుతూ పబ్బం గడుపుతున్నాడన్నారు. నవోదయ పాఠశాలలు, మెడికల్ కళాశాలల కోసం కేంద్రానికి ఎన్ని సార్లు విజ్ఞప్తి చేసినా ఒక్కటి కూడా ఇవ్వలేదన్నారు. అర్వింద్ నిధులు తీసుకురాలేదని.. యువత, ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు.

ఇందూరు గడ్డ.. గులాబీ అడ్డా

- ప్రజా సమస్యలపై పోరాడేది మేమే..
- బీఆర్‌ఎస్‌కు ఊపిరులూదింది నిజామాబాద్ జిల్లానే..
- నా గుండెల్లో ప్రత్యేకం స్థానం ఉంది
- పదేళ్లలో ఎంతో అభివృద్ధి చేశాం
- కాంగ్రెస్ పాలనలో కరెంట్ కోతలే..
- కార్నర్ మీటింగ్‌లో బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్



నగరంలో కొనసాగుతున్న కేసీఆర్ బస్సుయాత్ర



బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డిని గెలిపించాలని కోరుతున్న కేసీఆర్

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ గడ్డ.. గులాబీ పార్టీ అడ్డా అని బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. తాను పార్టీ పెట్టగానే ఈ జిల్లా ఊపిరి పోసిందని, ఇక్కడి ప్రజలు బీఆర్‌ఎస్‌కు తొలి జెడ్పీ చైర్మన్ స్థానం ఇచ్చారని గుర్తు చేశారు. మొదటి సారి గులాబీ జెండా ఎగిరింది నిజామాబాద్ జిల్లాలోనేనన్నారు. నా గుండెలో ఈ జిల్లాకు ప్రత్యేక స్థానం ఉందని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని నెహ్రూపార్క్ చౌరస్తాలో సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ కార్నర్ మీటింగ్‌లో కేసీఆర్ ప్రసంగించారు. రాష్ట్రంలోనే నిజామాబాద్ ఒకప్పుడు బంగారు జిల్లా అన్నారు. పదేళ్లలో ఈ ప్రాంతాన్ని ఎంతగానో అభివృద్ధి చేశామన్నారు. కాంగ్రెస్, టీడీపీ హయాంలో గుత్ప, అలీసాగర్‌లను పట్టించుకోలేదన్నారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత నిజాంసాగర్‌లో నీళ్లు నింపి, వరద కాల్వలు అభివృద్ధి చేశామన్నారు. ఎస్సారెస్పీ పునరుజ్జీవన పథ కాన్ని నిర్మించామని ఆయన తెలిపారు. మిషన్‌భగీరథ ద్వారా ఇంటింటికి నీరు ఇచ్చామన్నారు. ఇలా ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేశామని కేసీఆర్ పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో కరెంట్ కోతలు అనేవే లేవన్నారు. కానీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కరెంటు కోతలు మొదలయ్యాయని వివరించారు. కల్యాణలక్ష్మిలో భాగంగా తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి తుస్సు మనిపించారన్నారు. ధాన్యం కొనే పరిస్థితి లేదని.. పంటకు బోనస్ ఇవ్వలేదని.. గిట్టు బాటు ధర ఇవ్వ డం లేదని.. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వడంలేదని మండిపడ్డారు.

నిరుపేద విద్యార్థుల కోసం ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకంలో భాగంగా విదేశీ విద్య కోసం రూ. 20లక్షలు సహాయం చేస్తే.. కాంగ్రెస్ పార్టీ నిలిపివేసిందని ఆరోపించారు. కేసీఆర్ కిట్ బంద్ చేశారని, సీఎంఆర్‌ఎఫ్ ఇవ్వడం లేదని విమర్శించారు. చేనేత కార్మికులకు ఆర్డర్లు ఇవ్వడంలేదని.. పనులు లేక ఆత్మహత్యలు మొదలయ్యాయని, రాష్ట్రంలో పరిశ్రమలు కూడా తరలిపోయే పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థులు గెలిస్తే.. కాంగ్రెస్ ఇచ్చిన హామీ లను మెడలు వంచి అమలు చేయిస్తామని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తెలిపారు. పోరాటాలు చేస్తేనే ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతాయని పేర్కొన్నారు.

బైపాస్ చౌరస్తాలో కేసీఆర్‌కు స్వాగతం

కేసీఆర్ బస్సుయాత్ర సోమవారం జిల్లాలోని కమ్మర్‌పల్లిలో అడుగుపెట్టింది. మోర్తాడ్, పెర్కిట్ చౌరస్తా మీదుగా నిజామాబాద్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా కంఠేశ్వర్ బైపాస్ చౌరస్తాలో బీఆర్‌ఎస్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా ఆధ్వర్యంలో మహిళలు హారతి ఇచ్చి స్వాగతం పలికారు. బస్సుయాత్ర కంఠేశ్వర్, ఎన్టీఆర్ చౌరస్తా, బస్టాండ్, గాంధీచౌక్ మీదుగా నెహ్రూ పార్కు చౌరస్తా వరకు సాగింది.

బీడీ కార్మికులకు పింఛన్ ఇచ్చింది బీఆర్‌ఎస్ ప్రభుత్వమే..

దేశంలో ఏ రాష్ట్రంలో కూడా బీడీ కార్మికులకు ప్రభుత్వాలు జీవనభృతి ఇవ్వడం లేదని బీఆర్‌ఎస్ అధినేత పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో ప్రతి నెల బీడీ కార్మికులకు రూ. 2వేల జీవన భృత్తి ఇచ్చామని వివరించారు. తాము బీడీ కార్మికులను ఆదుకున్నామని, నిజాయితీతో ఓటు వేయాలన్నారు. నరేంద్రమోదీ బీడీ కార్మికులను పట్టించుకోలేదన్నారు.

హైలైట్స్..

- రాత్రి 8.33 నిమిషాలకు కేసీఆర్ బస్సు యాత్ర నెహ్రూపార్క్ చౌరస్తాకు చేరుకుంది.
- 8.41 నిమిషాలకు కేసీఆర్ బస్సుపైకి చేరుకుని ప్రజలకు అభివాదం చేసి ప్రసంగం ప్రారంభించారు.
- 9.05 నిమిషాలకు ముగియగా.. 24 నిమిషాల పాటు ప్రసంగం సాగింది.
- అనంతరం బస్సులో బయలుదేరి మాజీ ఎమ్మెల్యే బిగాల నివాసానికి చేరుకున్నారు.

ఐదు నెలలు గడిచినా రుణమాఫీ చేయలే..

కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి ఐదునెలలు గడుస్తుందని.. అయినా ఇప్పటికీ రుణమాఫీ చేయలేదని కేసీఆర్ మండిపడ్డారు. అధికారంలోకి రాగానే మాఫీ చేస్తానన్న ముఖ్యమంత్రి ఇప్పటి వరకు ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. రైతు బంధు డబ్బులు రైతులకు వెయ్యలేదని.. తాను యాత్ర ప్రారంభించగానే రేవంత్‌రెడ్డి భయంతో రైతు బంధు డబ్బులు వేస్తున్నారని పేర్కొన్నారు. రైతుబంధు కూడా ఐదెకరాల్లోపు రైతులకే పరిమితం చేయబోతున్నారని ఆరోపించారు. ప్రజా సమస్యలపై గళమెత్తి పోరాడేది కేవలం బీఆర్‌ఎస్ పార్టీయేనని స్పష్టం చేశారు. అందుకే బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, ఎంపీ కేఆర్ సురేశ్‌రెడ్డి, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా, జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు, మేయర్ దండు నీతూకిరణ్, నాయకులు ఎస్‌ఏ అలీం, బీఆర్‌ఎస్ బోధన్ నియోజకవర్గ ఇన్‌చార్జి షాతిమా, నాయకులు పాల్గొన్నారు.



కేసీఆర్‌కు స్వాగతం పలికేందుకు నగరంలోని కంఠేశ్వర్ బైపాస్ వద్ద ఎదురుచూస్తున్న బిగాల, మహిళలు



కార్నర్ మీటింగ్‌లో పాల్గొన్న మహిళా నాయకులు

నో పర్మిషన్.. అయినా అడ్మిషన్..!

- జిల్లాలో విచ్చలవిడిగా ప్రయివేటు పాఠశాలల ఏర్పాటు
- అనుమతులు లేకున్నా పిల్లలను చేర్చుకుంటున్న ప్లే స్కూల్స్
- నిబంధనలు బేఖాతరు చేస్తున్న యాజమాన్యాలు



నిజామాబాద్‌అర్బన్: జిల్లాలో ప్రయివేటు పాఠశాలలు, ప్లే స్కూల్స్ విచ్చలవిడిగా వెలుస్తున్నాయి. ఎలాంటి అనుమతి లేకుండానే స్కూళ్లను నడుపుతున్నాయి. ప్రభుత్వ అనుమతి లేకుండానే అడ్మిషన్లు తీసుకుంటున్నాయి. అధికారులను మచ్చిక చేసుకుని పాఠశాలలను కొనసాగిస్తున్నాయి. ఇలా అనుమతి లేని పాఠశాలలు, ప్లే స్కూల్స్ విద్యార్థుల పాలిట శాపంగా మారుతున్నాయి.

తల్లిదండ్రులను మోసం చేస్తున్న స్కూళ్లు

జిల్లాలో ప్రయివేటు పాఠశాలలు అనుమతి లేకుండా కొనసాగుతూ విద్యార్థులను వారి తల్లిదండ్రులను మోసం చేస్తున్నాయి. ఈ ఏడాది జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్, కంఠేశ్వర్, సుభాష్‌నగర్ ప్రాంతంలో ఇటీవల ఏర్పాటు చేసిన ప్రయివేటు పాఠశాలలకు అనుమతి లేదు. వినాయక్‌నగర్‌లో ఓ కార్పొరేట్ పాఠశాలకు 8 నుంచి 10 వరకు పర్మిషన్ లేదు. ఆటోనగర్‌లో ఆరేళ్లుగా ఓ ప్రైవేటు పాఠశాల 6 నుంచి 10 వరకు అనుమతి లేకుండా కొనసాగుతోంది. ఇదే ప్రాంతంలో మరో పాఠశాల షిఫ్టింగ్ అనుమతి లేకుండా నడుస్తోంది. అలాగే ఈ ఏడాది జిల్లాలో కొత్తగా 15 వరకు ప్లేస్కూల్స్ ఏర్పడ్డాయి. కానీ వీటికి మాత్రం ఎలాంటి అనుమతి లేకుండా కొనసాగుతున్నాయి. నిబంధనల ప్రకారం ముందస్తుగా జిల్లా విద్యాశాఖ అధికారి, లేదా సంబంధిత మండల విద్యాశాఖ అధికారి అనుమతి పొందాల్సి ఉంటుంది. అధికారుల పరిశీలన అనంతరం అనుమతి మంజూరు చేస్తారు. కానీ నిబంధనలు ఏమీ లేకుండానే నివాస భవనాలను ఎంపిక చేసుకొని కొందరు ప్లే స్కూల్స్ కొనసాగిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని గంగాస్థాన్‌లో ఈ ఏడాది కొత్తగా రెండు ప్లేస్కూల్స్ ప్రారంభమయ్యాయి. ఇవి కూడా పర్మిషన్ లేకుండానే కొనసాగుతున్నాయి. వీటిలో 40 నుంచి 50 మంది వరకు విద్యార్థులు ఉన్నారు. కంఠేశ్వర్ హౌసింగ్ బోర్డు కాలనీలో శిథిలావస్థలో ఉన్న భవనాన్ని తీసుకొని స్కూల్ కొనసాగిస్తుండగా దీనికి అనుమతి లేదు. సుభాష్‌నగర్‌లో ఓ ప్రభుత్వ టీచర్ ఇల్లు అద్దెకు తీసుకొని పర్మిషన్ లేకుండా ప్లే స్కూల్ నిర్వహిస్తున్నాడు. ఆర్మూర్‌లో రిటైర్డ్ టీచర్ మూడేళ్లు అనుమతి లేకుండా ప్లేస్కూల్‌ను నడుపుతున్నాడు. నిజామాబాద్ నగర శివారులో రెండు ప్రయివేటు పాఠశాలలు భవనాలు లేకున్నా, అనుమతి లేకున్నా అడ్మిషన్లు కొనసాగిస్తున్నాయి.

కనీస సౌకర్యాలు కరువు

జిల్లాలో కొన్ని ప్లేస్కూళ్లను నివాస భవనాల్లో కొనసాగిస్తుండగా విద్యార్థులకు కనీస సౌకర్యాలు లేవు. నగరంలోని ఆర్మూర్ రోడ్డులో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని కొనసాగుతున్న స్కూల్‌లో ఒకే గదిలో 40 మంది విద్యార్థులకు విద్యనందిస్తున్నారు. వీరందరికి ఒకే బాత్‌రూం అందుబాటులో ఉంది. కంఠేశ్వర్ హౌసింగ్ బోర్డు కాలనీలో పాత భవనానికి రంగులు వేసి పాఠశాల నడుపుతున్నారు. మారుతినగర్‌లో మరో ప్లేస్కూల్ భవనాన్ని అద్దెకు తీసుకొని రెండు గదుల్లోనే 42 మందికి విద్యార్థులకు చదువు చెబుతున్నారు. విద్యార్థులకు ఆట వస్తువులు, తాగునీరు విడివిడిగా బాత్‌రూంలు అందుబాటులో లేవు. 40 మంది విద్యార్థులు ఉన్న ఒక ఆయా ఇద్దరు లేదా ముగ్గురు టీచర్లతోనే కొనసాగిస్తున్నారు. ఇలా అనేక ప్లే స్కూళ్లు అనుమతి లేకుండా కొనసాగుతున్నాయి. విద్యాశాఖ అధికారులకు మమూళ్లు ముట్టజెబుతూ నడిపించేస్తున్నారు. అలాగే వినాయక్‌నగర్‌లో ఓ కార్పొరేట్ పాఠశాలకు 8 నుంచి 10వ తరగతి వరకు అనుమతి లేదు. దీనిపై కొందరు విద్యార్థి సంఘ నాయకులు ఎంఈవోకు ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇలా జిల్లాలో పాఠశాలలను ఇష్టారాజ్యంగా నడుపుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోకపోవడం గమనార్హం.

చర్యలు తీసుకుంటాం

అనుమతి లేకుండా ప్రయివేటు పాఠశాలలు, ప్లే స్కూ ల్స్ కొనసాగితే కఠిన చర్యలు తీసుకుంటాం. ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తల్లిదండ్రులు సైతం అనుమతి లేని పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించవద్దు. – దుర్గాప్రసాద్, డీఈవో

సీయూల రెండో విడత ర్యాండమైజేషన్



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా అదనపు కంట్రోల్ యూనిట్ల రెండో విడత ర్యాండమైజేషన్ నిర్వహించారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు నేతృత్వంలో సోమవారం సాధారణ పరిశీలకులు ఎలిస్ వజ్ ఆర్ సమక్షంలో ప్రక్రియ పూర్తి చేశారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ర్యాండమైజేషన్ ప్రక్రియలో గుర్తింపు పొందిన పార్టీల ప్రతినిధులు, ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు, వారి తరపున ప్రతినిధులు హాజరయ్యారు. పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని ఆర్మూర్, బోధన్ అసెంబ్లీ నియోజకవర్గాలకు అదనంగా 15 చొప్పున కంట్రోల్ యూనిట్లు, బాల్కొండకు 40, నిజామాబాద్ అర్బన్‌కు 35, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గానికి 20 సీయూలు అదనంగా అందుబాటులో ఉంచామని కలెక్టర్ వివరించారు. అదనపు సీయూలు సెక్టోరల్ అధికారుల వద్ద రిజర్వ్‌లో ఉంచామని, పోలింగ్ సమయంలో ఎక్కడైనా ఈవీఎంలలో సాంకేతిక సమస్య తలెత్తితే తమ వద్ద రిజర్వ్‌లో ఉండే సీయూలను సమకూరుస్తారని కలెక్టర్ తెలిపారు. కోరుట్ల, జగిత్యాల అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో కమిషనింగ్ ప్రక్రియ పూర్తయిన తర్వాత సాంకేతిక సమస్యలు ఏర్పడిన సీయూల సంఖ్య ఆధారంగా అదనపు యూనిట్లు కేటాయిస్తామని కలెక్టర్ తెలిపారు. ర్యాండమైజేషన్ ప్రక్రియలో ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, సాత్విక్, సంతోష్, జితేందర్ పాల్గొన్నారు.

సదుపాయాలపై దృష్టి సారించాలి

ఈనెల 13న పోలింగ్ జరగనున్న నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. పోలింగ్ నిర్వహణకు ఎలాంటి అవాంతరాలు ఎదురుకాకుండా అవసరమైన అన్ని వసతులు అందుబాటులో ఉండేలా ముందస్తుగానే ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లపై కలెక్టర్ సోమవారం సెల్ కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో సమీక్షించారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌ను అధికారులు క్షేత్రస్థాయిలో సందర్శించాలని, ఏవైనా లోటుపాట్లు ఉంటే వెంటనే సరిచేయాలన్నారు. ముఖ్యంగా వేసవి తీవ్రత దృష్ట్యా ఓటర్లకు, బీఎల్‌వోలు, వాలంటీర్లు, ఆశ వర్కర్లకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీల కార్యదర్శులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఓటర్ల సౌకర్యార్థం పోలింగ్ కేంద్రాల్లో ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటుచేయాలని, ఓటరు సమాచార స్లిప్పుల పంపిణీ మంగళవారం నాటితో వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. మోడల్ పోలింగ్ కేంద్రాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని చెప్పారు. కాన్ఫరెన్స్‌లో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

48 కేసులు.. రూ. 1.22 కోట్లు సీజ్

- కొనసాగుతున్న ఎస్‌టీటీ, ఎఫ్‌ఎస్‌టీ, పోలీసుల తనిఖీలు
- రూ. 1.01 కోట్లు విడుదల

సుభాష్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఎస్‌టీటీ, ఎఫ్‌ఎస్‌టీ, పోలీసులు తనిఖీలు కొనసాగుతున్నాయి. తనిఖీల్లో రూ. 50వేల కంటే ఎక్కువ నగదు, బంగారం, వెండి తరలిస్తే అందుకు సరైన ఆధారాలు చూపకపోతే తనిఖీ అధికారులు ఆ డబ్బు, వస్తువులను జప్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటి వరకు మొత్తం 48 కేసులు నమోదు కాగా.. రూ. 1.22 కోట్ల విలువైన నగదు, బంగారం, వెండి, ఇతర వస్తువులను సీజ్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను సంబంధిత అధికారులు సోమవారం వెల్లడించారు. తనిఖీల్లో జప్తు చేసిన నగదు, బంగారం, వెండి వస్తువులు రూ. 10 లక్షలకు లోబడి ఉండి, తగిన ఆధారాలు చూపిన పక్షంలో వాటిని విడుదల చేయడానికి జిల్లాస్థాయిలో జిల్లా గ్రీవెన్స్ కమిటీ (డీజీసీ)ని ఏర్పాటు చేశారు. ఒకవేళ జప్తు చేసిన నగదు, బంగారం, వెండి ఇతర వస్తువుల విలువ రూ. 10 లక్షలకు మించి ఉంటే ఈ కమిటీ వివరాలను పరిశీలన కోసం ఆదాయ పన్ను విభాగం నోడల్ అధికారికి పంపిస్తుంది. వారు పరిశీలించిన తర్వాత రిమార్కుల ప్రకారం తనిఖీల్లో రూ. 10 లక్షలకు మించి పట్టుబడిన నగదు, బంగారం, వెండిని విడుదల చేస్తున్నారు. ఇందులో భాగంగా గ్రీవెన్స్ కమిటీ పరిశీలన తర్వాత 43 కేసులకు సంబంధించి రూ. 1.01 కోట్లను విడుదల చేశారు. మరో నాలుగు కేసులు గ్రీవెన్స్ కమిటీ పరిశీలనలో ఉన్నాయి. ఒక కేసును ఆదాయపు పన్ను శాఖకు ప్రతిపాదించారు.

క్లుప్తంగా

బాన్సువాడలో పోచారం ఇంటింటా ప్రచారం



బాన్సువాడ: బాన్సువాడ పట్టణంలో సోమవారం ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గత పదేళ్లలో బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం వచ్చాక ప్రజలు పడుతున్న ఇబ్బందులను ఓటర్లకు వివరించారు. పింఛన్ల పెంపు, రైతు రుణమాఫీపై కాంగ్రెస్‌ ప్రభుత్వంపై ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతపై ఓటర్లకు వివరించారు. ఎంపీ అభ్యర్థిగా గాలి అనీల్‌ కుమార్‌కు ఓటేసి పార్లమెంట్‌కు పంపాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్మన్‌ జంగం గంగాధర్‌, నాయకులు అంజిరెడ్డి, కృష్ణారెడ్డి, గురువినయ్‌, నార్ల రవీందర్‌, జుబేర్‌, మోచి గణేష్‌, తదితరులు ఉన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నిజామాబాద్‌నాగారం: నగరంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం లయన్స్‌ క్లబ్‌ ఆఫ్‌ ఇందూరు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అబ్బాయి లింబాద్రి, కార్యదర్శిగా చెన్న రవీంద్రనాథ్‌గుప్తా, కోశాధికారిగా పెట్టిగాడి రాఘవేందర్‌ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే ఉపాధ్యక్షులుగా పాలాస సత్యనారాయణ, మచ్చ రవీందర్‌, సిలివేరి గణేశ్‌, సంయుక్త కార్యదర్శులుగా షేక్‌ ఖాదర్‌ బాషా, జమాల్పూర్‌ రాజశేఖర్‌, పీఆర్వోగా గంగాదాస్‌, లయన్‌ టేమర్‌గా దాసరి రాఘవేందర్‌, టెయిల్‌ ట్విస్టర్‌గా సబ్బని శ్రీనివాస్‌ ఎన్నికయ్యారు. సర్వీస్‌ కమిటీ చైర్‌పర్సన్‌ గురుప్రసాద్‌, మెంబర్‌షిప్‌ కమిటీ చైర్‌ పర్సన్‌ లక్ష్మీనారాయణ, డైరెక్టర్లుగా బంటు రాజయ్య, రావి నేతాజి, యాదగిరి, సత్యనారాయణ, రామకృష్ణారెడ్డి, డీఎల్‌ఎన్‌ స్వామి, కృష్ణమూర్తి, అంకం గణేశ్‌, రవీందర్‌, శంకర్‌, రమేశ్‌బాబు, శివలింగం ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా లక్ష్మీనారాయణ వ్యవహరించారు.

ప్రాచీన ఆలయాల పునరుద్ధరణ



నిజామాబాద్‌నాగారం: మన పూర్వీకులు నిర్మించిన 1600లకు పైగా ప్రాచీన ఆలయాలు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంటున్నాయని వాటికి పూర్వవైభవం తీసుకురావడమే తన లక్ష్యమని పార్లమెంట్‌ స్వతంత్ర అభ్యర్థి కొత్తకొండ శక్తిప్రసాద్‌ పేర్కొన్నారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన మాట్లాడారు. తాను గెలిస్తే బీడీ కార్మికులు, ప్రైవేట్‌ టీచర్లు, గల్ఫ్‌ బాధితుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు.

ట్రాఫిక్‌ సిగ్నల్‌తో ఇబ్బందులు

నిజామాబాద్‌ అర్బన్‌: నగరంలోని పూలాంగ్‌ చౌరస్తాలో సోమవారం ట్రాఫిక్‌ సిగ్నల్స్‌లో అన్ని రకాల సూచికలు ఒకేసారి రావడం వాహనదారులు అయోమయానికి గురయ్యారు. దీంతో అనేక వాహనాలు ఒకేసారి రావడంతో ఎండలో ఇబ్బందులు పడ్డారు.

గులాబీ అధినేతకు ఘనస్వాగతం

- ప్రత్యేక బస్సుపై పూలవర్షం
- బీఆర్‌ఎస్‌ శ్రేణుల్లో ఉత్సాహం



కమ్మర్‌పల్లిలో బస్సులో నుంచి ప్రజలకు అభివాదం చేస్తున్న కేసీఆర్‌, ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి





కమ్మర్‌పల్లిలో కేసీఆర్‌కు స్వాగతం పలుకుతున్న మహిళలు, బీఆర్‌ఎస్‌ శ్రేణులు

కమ్మర్‌పల్లి/ఆర్మూర్‌/పెర్కిట్‌/ఆర్మూర్‌ టౌన్‌/మోర్తాడ్‌: పార్లమెంట్‌ ఎన్నికల ప్రచారంలో భాగంగా జిల్లా కేంద్రానికి వెళ్తున్న మాజీ సీఎం కేసీఆర్‌కు కమ్మర్‌పల్లి మండల కేంద్రం, ఆర్మూర్‌ పట్టణంలోని పెర్కిట్‌లో బీఆర్‌ఎస్‌ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. కేసీఆర్‌ సోమవారం సాయంత్రం 6:30 గంటలకు రోడ్‌ షో ద్వారా కమ్మర్‌పల్లి మండల కేంద్రం మీదుగా జిల్లా లోకి ప్రవేశించారు. బస్టాండ్‌ వద్ద బీఆర్‌ఎస్‌ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ గుమ్మడి కాయతో స్వాగతం పలికారు. నాయకులు, కార్యకర్తలు, మహిళలు మంగళహారతులు ఇచ్చి బస్సుపై పూలవర్షం కురిపించారు. ఆర్మూర్‌లోని పెర్కిట్‌ చౌరస్తా, మామిడిపల్లి చౌరస్తా, కొత్త బస్టాండ్‌, అంబేడ్కర్‌ చౌరస్తా మీదుగా బయస్సు యాత్ర నిజామాబాద్‌వైపు సాగింది. కమ్మర్‌పల్లి నుంచి మోర్తాడ్‌కు బస్సు యాత్ర చేరుకోగా.. జాతీయ రహదారిపై మహిళలు వేచి ఉండి స్వాగతం పలికారు. బస్సులోనుంచే ఆయన ప్రజలకు అభివాదం చేస్తూ వెళ్లిపోయారు. కేసీఆర్‌ పర్యటన నిమిషాల వ్యవధిలోనే కమ్మర్‌పల్లి, మోర్తాడ్‌లో ముగిసింది. కేసీఆర్‌ వెంట ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మె ల్యే జీవన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



ఆర్మూర్‌లో ప్రజలకు అభివాదం చేస్తున్న కేసీఆర్‌



ఆర్మూర్‌ పట్టణంలోని పెర్కిట్‌ చౌరస్తాలో..



కమ్మర్‌పల్లిలో కేసీఆర్‌ రాకకోసం ఎదురు చూస్తున్న ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి

కాంగ్రెస్‌ మాటకు కట్టుబడి ఉంటుంది

- ఖరీఫ్‌ నాటికి రూ.2లక్షల రుణమాఫీ
- భీమ్‌గల్‌ బస్‌ డిపోను పునరుద్ధరిస్తాం
- కాంగ్రెస్‌ అభ్యర్థి జీవన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి

భీమ్‌గల్‌: వచ్చే ఖరీఫ్‌ నాటికి రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్‌ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి అన్నారు. భీమ్‌గల్‌, బడా భీమ్‌గల్‌లో సోమవారం నిర్వహించిన కార్నర్‌ మీటింగ్‌లలో జీవన్‌రెడ్డితోపాటు బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమని, తమ పార్టీ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటుందన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత మహిళలకు ఉచిత బస్సుసౌకర్యం, గృహ అవసరాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ అందిస్తున్నామని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్‌ అమలు చేస్తున్న పథకాలు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా అమలవుతున్నాయా? అని ప్రశ్నించారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా బీడీ కార్మికులకు పింఛన్‌ ఇస్తామన్నారు. గల్ఫ్‌లో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు అండగా ఉంటామని, రూ.5 లక్షల ఆర్థిక సహాయం కాంగ్రెస్‌ ద్వారా అందిస్తామని తెలిపారు. కేసీఆర్‌కు పెద్ద కొడుకునని చెప్పుకునే ప్రశాంత్‌రెడ్డి 21 ప్యాకేజీ పనులు ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. తాను ఎంపీగా గెలిస్తే ఏడాదిలోగా 21 ప్యాకేజీ పూర్తి చేసి, రైతులకు నీరు అందిస్తానని, భీమ్‌గల్‌ బస్‌ డిపోను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. జీవితంలో చివరి అంకానికి వచ్చానని, ఆశీర్వదించి ఎంపీగా గెలిపిస్తే చివరి శ్వాస వరకు ప్రజలకు సేవ చేసుకుంటానన్నారు. ముత్యాల సునీల్‌ మాట్లాడుతూ.. మచ్చలేని నాయకుడు జీవన్‌రెడ్డిని గెలిపిస్తే కేంద్రంలో మంత్రి పదవి వస్తుందని అన్నారు.

'విశాల జనసభ' విజయవంతం



సుభాష్‌నగర్‌: ఇందూరు విశాల జన సభ పేరుతో నిర్వహించిన బహిరంగ సభకు తరలివచ్చి విజయవంతం చేసిన ప్రతిఒక్క కార్యకర్తకు, సహకరించిన పోలీస్‌, అధికార యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్‌కులాచారి అన్నారు. నగరంలోని పార్టీలో కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశానికి మోదీ అవసరమని ప్రజలు విశ్వసిస్తున్నారనడానికి విశాల జనసభకు తరలివచ్చిన ప్రజలే నిదర్శనమన్నారు. సభ విజయవంతం కావడంతో కార్యకర్తల్లో ఉత్సాహం రెట్టింపు అయ్యిందని, పార్లమెంట్‌ నియోజకవర్గంలో బీజేపీకి పటిష్ట నాయకత్వం ఉందన్నారు. కాంగ్రెస్‌ ఆరు గ్యారెంటీల అమలులో ఘోరంగా విఫలమైందని, ప్రజల్లో ఆ పార్టీ విశ్వసనీయత కోల్పోయిందన్నారు. బీఆర్‌ఎస్‌ పదేళ్ల ఆర్థిక, రాజకీయ, అధికార, ఇతర అన్ని వ్యవస్థలను నాశనం చేసిందని, రాష్ట్రం పదేళ్లు వెనుకబడిపోయిందని ఆరోపించారు. ఎంపీ అర్వింద్‌.. ఏడు ఆర్‌వోబీలు, నవోదయ, రెండు కేంద్రీయ విద్యాలయాలతోపా టు రైల్వే ప్రాజెక్టులు తీసుకొచ్చారని గుర్తుచేశారు. కమలం గుర్తుకు ఓటేసి అర్వింద్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా ప్రధానకార్యదర్శి న్యాలం రా జు, ఫ్లోర్‌లీడర్‌ స్రవంతిరెడ్డి, కార్పొరేటర్లు, నాయకులు ప్రమోద్‌కుమార్‌, పద్మారెడ్డి, బద్దం కిషన్‌, నారాయణయాదవ్‌, నాయిడి రాజన్న, రోషన్‌, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్‌

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

రుద్రూర్‌: కోటగిరి మండలం ఎత్తొండ గ్రామానికి చెందిన వన్నెల నాగయ్య (52) అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఉన్నాయి. ఆదివారం రాత్రి నాగయ్య తలుపులకు గొళ్లెం పెట్టొద్దని భార్య లక్ష్మితో చెప్పి బయటికి వెళ్లాడు. సోమవారం ఉదయం నాగయ్య శవమై కనిపించాడు. అయితే, భార్యాభర్తలకు తరచూ గొడవలు జరిగేవని, తన వదిన లక్ష్మిపై అనుమానం ఉందని మృతుడి తమ్ముడు సత్యం పోలీసులుకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్‌ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..

కామారెడ్డి క్రైం: బైక్‌ అదుపు తప్పిన ఘటనలో ఒకరు మృతి చెందారు. కామారెడ్డి సమీపంలోని పొందుర్తి వద్ద ఆదివారం రాత్రి జరిగిన ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. తాడ్వాయికి చెందిన చెట్కూరి చిన్నరాజయ్య (58) అనే వ్యక్తి తన బంధువుల ఇంట్లో శుభకార్యం ఉందని ఉదయం బైక్‌పై వెళ్లాడు. రాత్రి 9 గంటల ప్రాంతంలో తిరిగి వస్తుండగా ప్రధాన రహదారిపై స్పీడ్‌ బ్రేకర్‌ను దాటుతున్న క్రమంలో బైక్‌ అదుపు తప్పి డివైడర్‌పై పడిపోయాడు. తలకు తీవ్రగాయాలు కావడంతో ఘటనాస్థలంలోనే మృతి చెందాడు. మృతుడి భార్య సిద్ధవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

చెరువులో పడి యువకుడు..

మాక్లూర్‌: మండలంలోని బోర్గాం చెరువులోపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని నాందేవ్‌వాడలో గలసంజీవయ్య కాలనీకి చెందిన హనుంతే విశాల్‌ బాబు(24), బంటు శక్తి, ఆర్మూర్‌ నరేశ్‌ ముగ్గురూ కలిసి ఆదివారం బోర్గాం చెరువు వద్ద మద్యం సేవించారు. చెరువులో కాళ్లు, చేతులు కడుక్కునేందుకు వెళ్లిన విశాల్‌బాబు ప్రమాదవశాత్తు నీటిలో పడిపోయాడు. అతడిని కాపాడేందుకు బంటుశక్తి, నరేశ్‌ చెరువులోకి దిగగా, వాళ్లు కూడా మునిగిపోయే క్రమంలో స్థానికులు ఇద్దరిని కాపాడారు. విశాల్‌ అప్పటికే నీటిలో మునిగిపోయి ఆచూకీ లభించలేదు. సోమవారం ఉదయం పోలీసులు గజఈతగాళ్ల సహాయంతో మృతదేహాన్ని వెలికితీయించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్‌ మృతి



మోహన్‌గౌడ్‌ (ఫైల్‌)

భిక్కనూరు: మండలంలోని బస్వాపూర్‌ గ్రామ మాజీ సర్పంచ్‌ కొయ్యల మోహన్‌గౌడ్‌ (59) సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. గౌడ సంఘం అధ్యక్షుడిగా, జిల్లా గౌడ సంఘం కార్యదర్శిగా కూడా మోహన్‌గౌడ్‌ పని చేశారు. నాలుగురోజుల క్రితం ఆయన అనారోగ్యానికి గురయ్యారు. సోమవారం మధ్యాహ్నం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించగా, ఆయా గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు పాల్గొని నివాళులర్పించారు.

సంపులో పడి బాలుడు మృతి



అన్విత్‌ (ఫైల్‌)

కామారెడ్డి రూరల్‌: ఆడుకుంటూ నీటి సంపులో పడి మూడేళ్ల బాలుడు మృతి చెందిన ఘటన కామారెడ్డి జిల్లా చిన్నమల్లారెడ్డి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మాచారెడ్డి మండలం అక్కాపూర్‌ గ్రామానికి చెందిన దేవరాజు కుమారుడు అన్విత్‌ (3) తల్లితో పాటు వేసవి సెలవుల నిమిత్తం అమ్మమ్మ గారి ఊరైన చిన్నమల్లారెడ్డి గ్రామానికి వచ్చారు. సోమవారం ఉదయం సుమారు ఎనిమిది గంటల సమయంలో ఇంటి ముందు బాలుడు ఆడుకుంటుండగా బంతి నీటి సంపులో పడిపోయింది. బంతి కోసం వంగి చూసిన బాలుడు సంపులో పడిపోయాడు. పది హేను నిముషాల తర్వాత గమనించిన కుటుంబ సభ్యులు బాలుడిని కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాలుడు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దేవరాజుకు ఇద్దరు కుమారులు ఉండగా ఒకరు మృతి చెందారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపారు.

డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ కేసులో ఇద్దరికి రెండు రోజుల జైలు

కామారెడ్డి క్రైం: మద్యం సేవించి వాహనాలు నడిపిన ఇద్దరికి కామారెడ్డి కోర్టు రెండు రోజుల జైలు శిక్ష విధించింది. పట్టణ పోలీసులు రెండు రోజుల క్రితం వాహనాలను తనిఖీ చేయగా, ఇద్దరు వ్యక్తులు మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. సోమవారం కోర్టులో ఇరువురిని హాజరుపర్చగా ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి ప్రతాప్‌ రెండు రోజుల జైలు శిక్ష, రూ.200 చొప్పున జరిమానా విధించినట్లు ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

మహిళ అదృశ్యం

వేల్పూర్‌: మండలంలోని వెంకటాపూర్‌ గ్రామానికి చెందిన చింతలటేకు రాణి(24) అదృశ్యమైనట్లు ఎస్సై వినయ్‌కుమార్‌ సోమవారం తెలిపారు. సోమవారం ఉదయం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా రాణి తన ఏడు నెలల కొడుకును తీసుకొని వెళ్లిపోయిందని, ఆమె భర్త ఫిర్యాదు మేరు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు. రాణి ఆచూకీ తెలిసినవారు 8712659862 నంబర్‌కు సమాచారం అందించాలని ఎస్సై కోరారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



జక్రాన్‌పల్లి: మండలంలోని కొలిప్యాక్‌ జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించిన 1999- 2000 ఎస్సెస్సీ బ్యాచ్‌ విద్యార్థులు సోమవారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. అనంతరం ఇటీవల ఎస్సెస్సీ పరీక్షల్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థినులను సత్కరించారు. దాసరి రవి, మురళి, సుమన్‌ తదితరులు పాల్గొన్నారు.

టాటా సుమో చోరీ

బాన్సువాడ : పట్టణానికి చెందిన సీమల సాయిలు తన ఇంటి సమీపంలో పార్క్‌ చేసిన టాటాసుమోను ఆదివారం రాత్రి దుండగులు ఎత్తుకెళ్లినట్లు సీఐ కృష్ణ తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

స్టార్టర్‌ ..

దోమకొండ: మండలంలోని గొట్టిముక్కుల గ్రామానికి చెందిన రైతు శివశంకర్‌ వ్యవసాయబావి వద్ద నుంచి దుండగులు బోరుమోటార్‌ స్టార్టర్‌ను ఎత్తుకెళ్లారు. చెట్టుకు కట్టి ఉంచిన స్టార్టర్‌ను ఎత్తుకెళ్లారని, ఈ విషయమై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధిత రైతు తెలిపాడు.

అహంకారానికి, నిజాయితీకి మధ్య ఎన్నికలు

- చక్కెర పరిశ్రమలను కేంద్రం ఎందుకు స్వాధీనం చేసుకోలేదు
- ప్రకటనలకే పరిమితమైన పసుపు బోర్డు
- బీజేపీ వస్తే రిజర్వేషన్లను మారుస్తారు
- మాజీ విప్‌, టీఎస్‌ఎండీసీ చైర్మన్‌ ఈరవత్రి అనిల్‌



మాట్లాడుతున్న టీఎస్‌ఎండీసీ చైర్మన్‌ అనిల్‌

ఖలీల్‌వాడి: ఈ ఎన్నికలు ఎంపీ అర్వింద్‌ అహంకారానికి.. కాంగ్రెస్‌ అభ్యర్థి జీవన్‌రెడ్డి నిజాయితీకి మధ్య జరుగుతున్నాయని మాజీ విప్‌, రాష్ట్ర మినరల్‌ డెవలప్‌మెంట్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ ఈరవత్రి అనిల్‌ ఆన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్‌ భవన్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఐదేళ్లుగా బీజేపీ పసుపు బోర్డుపై మాట్లాడుతోందని, చేతల్లో మాత్రం ఏమీ లేదని విమర్శించారు. బీజేపీ ఆదివారం నిర్వహించిన సభలో అమిత్‌షా మళ్లీ పాతప్రకటనలే చేశారన్నారు. గత ఎన్నికల్లో కవితకు గుణపాఠం చెప్పిన విధంగానే ఈ ఎన్నికల్లో అర్వింద్‌కు రైతులు గుణపాఠం చెబుతారన్నారు. బీడీ కార్మికుల ప్రత్యేక హాస్పిటల్‌ ఏర్పాటు చేస్తామని ప్రకటించినప్పటికీ ఇప్పటి వరకు గతి లేదని విమర్శించారు. నిజాం షుగర్‌ ఫ్యాక్టరీ గురించి బీజేపీ నాయకులు ఒక్కొక్కరూ ఒక్కో మాట మాట్లాడుతున్నారని, కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి ఎందుకు తెరిపించలేదని, బీఆర్‌ఎస్‌ ప్రభుత్వంపై పోరాటం ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. చక్కెర పరిశ్రమ కోసం పాదయాత్ర చేసి చేతులు దులుపుకున్నారని, దీనిపై ఎంపీ మాట్లాడిన దాఖలాలు లేవన్నారు. కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉంది కాబట్టి ఎన్నికల హామీ మేరకు సెప్టెంబర్‌ 15 వరకు షుగర్‌ ఫ్యాక్టరీని తెరిపిస్తామని ప్రకటించిందన్నారు. బీజేపీకి 400 ఎంపీ స్థానాలు వస్తే రిజర్వేషన్లు మారుస్తారని, దీంతో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అన్యా యం జరగుతుందన్నారు. కాంగ్రెస్‌ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కులగణన ప్రకారం రిజర్వేషన్లు అమలు చేస్తామన్నారు. బీజేపీ రాజ్యాంగాన్ని రద్దు చేసే కుట్ర చేస్తోందని ఆరోపించారు. సమావేశంలో విక్కీ యాదవ్‌, రత్నాకర్‌, జావెద్‌ అక్రం, ఈసా, బాల్కొండ, వేల్పూర్‌ మండలాల పార్టీ అధ్యక్షు లు వెంకటేశ్‌, నర్సారెడ్డి, అయూబ్‌, ఎజాజ్‌, సయ్యద్‌ ఖైసర్‌, కేశ మహేశ్‌, నవాజ్‌ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో పైరవీలకు స్థానం లేదు

- రైతులు వ్యాపారులుగా మారాలి
- చాయ్‌ పే చర్చలో ఎంపీ అర్వింద్‌



మాట్లాడుతున్న ఎంపీ ధర్మపురి అర్వింద్‌

ఆర్మూర్‌ : బీజేపీలో పైరవీలకు స్థానం లేదని ఎంపీ, అభ్యర్థి అభ్యర్థి ధర్మపురి అర్వింద్‌ అన్నారు. ఆర్మూర్‌ మండలం అంకాపూర్‌లో సోమవారం నిర్వహించిన చాయ్‌పే చర్చాలో ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్వింద్‌ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా 10 మంది మంత్రులు, 105 మంది సిట్టింగ్‌ ఎంపీలకు బీజేపీ హైకమాండ్‌ టికెట్లు కేటాయించలేదన్నారు. పనిచేసే వారికే బీజేపీలో గుర్తింపు ఉంటుందన్న విషయాన్ని గమనించాలన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికే భవిష్యత్‌లో ప్రాధాన్యత ఉంటుందన్నారు. పసుపు రైతులు వ్యాపారం నేర్చుకుని భవిష్యత్‌లో వ్యాపారవేత్తలుగా మారాలని, రానున్న రోజుల్లో క్వింటాల్‌ పసుపు ధర రూ.20వేలకు పైగా పలుకుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రానికి సహకరించడం లేదని, అవినీతి, అక్రమాలతో వ్యవస్థలు కుంటుపడ్డాయని ఆరోపించారు. బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యేలు రేషన్‌ బియ్యాన్ని రీసైక్లింగ్‌ చేస్తున్నారని ఆరోపించారు. ఆర్మూర్‌ మున్సిపల్‌ మాజీ చైర్మన్‌ కంచెట్టి గంగాధర్‌, నాయకులు పాల్గొన్నారు.

భారీగా అల్ప్రాజోలం పట్టివేత



మాట్లాడుతున్న ఎక్సైజ్‌ డిప్యూటీ కమిషనర్‌ సోమయ్య

- మూడు చోట్ల ఏకకాలంలో దాడులు
- ఐదుగురిపై కేసు నమోదు
- నాలుగు బైక్‌లు, ఐదు ఫోన్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎక్సైజ్‌ డిప్యూటీ కమిషనర్‌ సోమయ్య

ఖలీల్‌వాడి: అల్ప్రాజోలంను నిల్వ చేసి అమ్మేందుకు ప్రయత్నించిన ఐదుగురిపై కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్‌ డిప్యూటీ కమిషనర్‌ సోమయ్య తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. కొంత మంది కల్లులో కలిపే నిషేధిత అల్ప్రాజోలంను రవాణా చేస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు మూడు టీములుగా ఏర్పాడి మూడు చోట్ల దాడులు చేసి అల్ప్రాజోలంను స్వాధీనం చేసుకున్నామన్నారు. గొల్లపల్లి యాదగిరిగౌడ్‌, తాటికొండ నర్సయ్య, చెగ్గారి రాజేందర్‌గౌడ్‌, చేసూరి రాజేందర్‌గౌడ్‌, గడ రాజేశ్‌కుమార్‌, సుప్పని నవీన్‌కుమార్‌, షేక్‌హుస్సేన్‌, శంకర్‌పై కేసులు నమోదు చేసినట్లు వివరించారు. వీరి నుంచి 2.32 కిలోల అల్ప్రాజోలం, 0.530 క్లోరోహైడ్రేట్‌తోపాటు నాలుగు ద్విచక్రవాహనాలు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను ఆయా ఎక్సైజ్‌ పోలీస్‌స్టేషన్లలో అప్పగించామన్నారు. ఎక్సైజ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ జిల్లా అధికారి చంద్రభానునాయక్‌, ఎక్సైజ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ సీఐలు స్వప్న, వెంకటేశ్‌, ఎస్సై నర్సింహచారి, హెడ్‌కానిస్టేబుల్‌ నారాయణరెడ్డి, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

బెదిరింపులకు భయపడి ఆత్మహత్య



రాజు(ఫైల్‌)

లింగంపేట(ఎల్లారెడ్డి): బెదిరింపులకు భయపడి ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని భవానిపేటలో చోటుచేసుకున్న ఘటనకు సంబంధించి ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన సాకలి రాజు(35) తన భార్య యశోద, పిల్లలతో కలిసి హైదరాబాద్‌లో కూలీపనులు చేస్తూ అక్కడే ఉంటున్నాడు. బంధువు చనిపోవడంతో ఈనెల 2వ తేదీన స్వగ్రామానికి వచ్చారు. రాజు భార్య బ్యాగులోని పట్టగొలుసులు ఆదివారం కనిపించకపోవడంతో ఆమె ఎవరు తీశారని తిట్టింది. దీంతో తమనే తిడుతోందని అక్కడే ఉన్న గోపాల్‌, అనిల్‌, సంగవ్వ.. రాజుతోపాటు అతడి భార్య యశోదతో గొడవ పడ్డారు. ఈ క్రమంలో తన వద్ద తీసుకున్న రూ.15వేలు ఇస్తావా? లేదా? అని గోపాల్‌, రాజును బెదిరించడంతో భయపడి ఆయన ఇంట్లో ఎవరూ లేనిసమయంలో ఆదివారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రేమ విఫలమై యువకుడు..

డొంకేశ్వర్‌(ఆర్మూర్‌): ప్రేమ విఫలమైందని మనస్తాపానికి గురై డొంకేశ్వర్‌ మండలం నికాల్‌పూర్‌ గ్రామానికి చెందిన పాస్క శ్రీకాంత్‌(24) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. శ్రీకాంత్‌ ఐదేళ్లుగా ఓ అమ్మాయితో ప్రేమలో ఉన్నాడు. ప్రేమ విఫలం కావడంతో గత కొన్ని రోజులుగా మానసికంగా బాధపడుతూ ఈ నెల 5వ తేదీన ఉదయం పొలం వద్ద గడ్డిమందును తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు శ్రీకాంత్‌ను నందిపేట్‌లోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్‌కు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి తండ్రి పెంటన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యా ప్తు చేస్తున్నట్లు ఎస్సై రాహుల్‌ తెలిపారు. కలుపు గోలుగా ఉండే శ్రీకాంత్‌ ఆత్మహత్య చేసుకోవంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

అటవీభూమి దున్నిన ట్రాక్టర్‌ సీజ్‌



రాజంపేట: మండలంలోని ఎల్లారెడ్డిపల్లి తండా పరిధిలో అటవీభూమిని ఎల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కప్పల రమేశ్‌ దున్నడంతో ట్రాక్టర్‌ను సీజ్‌ చేసినట్లు ఎఫ్‌ఆర్‌వో రమేశ్‌ సోమవారం తెలిపారు. అటవీభూమిని దున్నినా, చెట్లను నరికినా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. బీట్‌ అధికారులు బాబా, రాజమణి, లచ్చయ్య, దేవేందర్‌ పాల్గొన్నారు.

రెండు వాహనాలు దహనం



బోధన్‌టౌన్‌(బోధన్‌): పట్టణంలోని రంగర్‌గల్లీకి చెందిన అన్నాదమ్ముళ్ల వాహనాలను ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేశారు. పట్టణ సీఐ వీరయ్య తెలిపిన వివరాల ప్రకారం.. రంగర్‌గల్లీకి చెందిన గంగాధర్‌ తన ఆటోను, తులసీరామ్‌ బైక్‌ను రోజులాగే తమ ఇళ్ల ముందు నిలిపి పడుకున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి ఆటోతోపాటు ద్విచక్ర వాహనాన్ని దహనం చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు వాహనాలను దహనం చేశారా? లేక ఎలక్ట్రిక్‌ కారణాలతో దహనమయ్యాయా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

క్లుప్తంగా...

పంట నష్ట పరిహారం నిధులు విడుదల

రూ. 15 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: ఇన్‌పుట్ సబ్సిడీని ప్రభుత్వం సోమవారం విడుదల చేసింది. గత మార్చి 16 నుంచి 21 మధ్య కాలంలో పది జిల్లాల్లో భారీ వర్షాలు, వడగండ్ల కారణంగా పంటలు దెబ్బతిన్న రైతులకు నష్ట పరిహారాన్ని మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. రూ. 15.81 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేస్తామని తెలిపింది. ఇన్‌పుట్ సబ్సిడీని ఆధార్‌తో అనుసంధానం చేసిన రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేస్తారు. 90 రోజుల వ్యవధిలో చెల్లింపులు పూర్తి చేస్తారు. ప్రతి రైతు ఒక వ్యవసాయ సీజన్‌లో ఒక విపత్తుకు మాత్రమే ఇన్‌పుట్ సబ్సిడీకి అర్హులని ప్రభుత్వం ప్రకటించింది. నిజమైన లబ్ధిదారులకు మాత్రమే ఇన్‌పుట్ సబ్సిడీ లభించేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. జిల్లాల వారీగా పంపిణీ వివరాలను ప్రభుత్వానికి అందజేయాలని వ్యవసాయ కమిషనర్‌ను ఆదేశించింది.

హత్యాయత్నాన్ని ఖండించిన వైద్య సంఘాలు

సాక్షి, హైదరాబాద్: కోరుట్ల ప్రభుత్వాసుపత్రిలో వైద్యులు, వైద్య సిబ్బందిని రోగి బంధువులు గదిలో బంధించి వారిపై పెట్రోల్ పోసి హత్యాప్రయత్నం చేయడంపై వైద్యులు, వైద్య సిబ్బంది ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డాక్టర్లు, వైద్య సిబ్బందిపై దాడి చేయడమే కాకుండా ఆసుపత్రిలో ఫర్నిచర్ ధ్వంసం చేసిన రోగి బంధువులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం రాష్ట్ర కోర్ కమిటీ సోమవారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఇలాంటి ఘటనల వల్ల వైద్యులు, సిబ్బంది ఆత్మస్థైర్యం దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేసింది. కోరుట్ల ఘటనను హెల్త్ కేర్ రిఫార్మ్స్ డాక్టర్స్ అసోసియేషన్, తెలంగాణ నర్సుల అసోసియేషన్ (టీఎన్‌ఏ) తీవ్రంగా ఖండించాయి. వైద్యులు ఎప్పుడూ రోగి ప్రాణాలను కాపాడటానికే ప్రయత్నిస్తారని అటువంటి వైద్యులపై దాడులు చేసిన వారిని చట్టపరంగా శిక్షించాలని తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ (టీ-జూడా) డిమాండ్ చేసింది.

వడదెబ్బకు ముగ్గురు మృతి

శంకరపట్నం, రామన్నపేట: వడదెబ్బకు గురై సోమవారం కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం కేశవపట్నానికి చెందిన పంజాల భారతి(56), తాడికల్ గ్రామానికి చెందిన చామంతుల మల్లయ్య(80), యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం సిరిపురం గ్రామానికి చెందిన పున్న కామేశ్వరమ్మ(70) మృతి చెందారు.

యాసంగి ధాన్యం సేకరణ అంతంతే!

కొనుగోళ్లు మొదలై నెల దాటినా సేకరించింది 22 లక్షల మెట్రిక్ టన్నులే

- లక్ష్యం 75 ఎల్ఎంటీ.. కానీ 40 ఎల్ఎంటీ కూడా కష్టమే: అధికారులు
- ప్రైవేటు వ్యాపారులు నేరుగా రైతుల నుంచి ధాన్యం కొంటుండటం వల్లే..!



సాక్షి, హైదరాబాద్: ఒకవైపు మండుతున్న ఎండలు... మరోవైపు అకాల వర్షాల నడుమ రాష్ట్రంలో యాసంగి ధాన్యం కొనుగోళ్లు అంతంత మాత్రంగానే సాగుతున్నాయి. నెల క్రితమే ధాన్యం సేకరణ మొదలైనప్పటికీ ఇప్పటివరకు 22 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం సేకరించింది. గతేడాది కొనుగోళ్లతో పోలిస్తే ఇది ఎక్కువే అయినప్పటికీ గత సంవత్సరంకన్నా ముందే ఈసారి కోతలు జరగడంతో ధాన్యం సేకరణ మందగించింది. ఇప్పటికే ఉమ్మడి నిజామాబాద్, నల్లగొండ జిల్లాల్లో ధాన్యం సేకరణ ప్రక్రియ ముగింపు దశకు వచ్చింది. కరీంనగర్, మెదక్ ఉమ్మడి జిల్లాల్లోనూ 60 శాతానికిపైగా ధాన్యం సేకరణ పూర్తయింది. మహబూబ్‌నగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో ధాన్యం కొనుగోళ్లు ఆలస్యంగా మొదలయ్యాయి. రంగారెడ్డి, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల్లో తక్కువ విస్తీర్ణంలో వరిసాగు చేయడంతో ఇక్కడ కొనుగోళ్లు నామమాత్రంగానే ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో పౌరసరఫరాల శాఖ అంచనా వేసినట్లు 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం లేదు. నిర్దేశించుకున్న లక్ష్యంలో సగం కూడా మార్కెట్‌కు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు.

4,804 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ

రాష్ట్రంలో హైదరాబాద్ మినహా వ్యవసాయం సాగే 32 జిల్లాల్లో సాగైన వరి పంట ఆధారంగా యాసంగిలో రైతుల నుంచి ధాన్యం సేకరణ 75.40 మెట్రిక్ టన్నులు ఉండొచ్చని పౌరసరఫరాల శాఖ అంచనా వేసింది. ఇందుకు అనుగుణంగా 7,210 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వాటిలో 7,154 కేంద్రాలను రాష్ట్రంలో తెరిచినప్పటికీ వాటిలో 4,804 కేంద్రాల్లోనే ప్రస్తుతం కొనుగోళ్లు సాగుతున్నాయి. వాటి ద్వారా ఇప్పటివరకు 22.17 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 3.51 లక్షల రైతుల నుంచి పౌరసరఫరాల సంస్థ సేకరించి కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) కోసం రైస్‌మిల్లులకు పంపించింది. అత్యధికంగా నిజామాబాద్, కామారెడ్డి, నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో ధాన్యం సేకరణ జరిగింది. ఆ తరువాత కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, సిరిసిల్ల, సిద్దిపేట, మెదక్ జిల్లాల్లోనూ ఇప్పటికే చాలా వరకు ధాన్యాన్ని సేకరించారు. ఈ జిల్లాల నుంచి ఇక తక్కువ ధాన్యమే కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉంది.

ధాన్యం విలువ రూ. 4,875 కోట్లు

రాష్ట్రంలో ఇప్పటివరకు పౌరసరఫరాల సంస్థ సేకరించిన ధాన్యం విలువ రూ. 4,875.91 కోట్లు. అందులో రైతుల బ్యాంకు ఖాతాల్లోకి ఇప్పటికే రూ. 3,085.62 కోట్లు చేరాయి. మరో రూ. 1,790.29 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేయాల్సి ఉంది. అయితే ఈ మొత్తాన్ని రైతులు విక్రయించిన ధాన్యం వివరాలు ఆన్‌లైన్ ప్రొక్యూర్‌మెంట్ మేనేజ్‌మెంట్ సిస్టం (ఓపీఎంఎస్)లోకి చేరిన వెంటనే ఖాతాల్లో వేయనున్నట్లు పౌరసరఫరాల సంస్థ అధికారులు తెలిపారు.

తనిఖీల భయంతో మిల్లర్ల కొనుగోళ్లు..

మార్చి మూడో వారంలోనే ఉమ్మడి నల్లగొండ, నిజామాబాద్ జిల్లాల్లో వరి కోతలు మొదలవడంతో సన్న ధాన్యం కోసం వ్యాపారులు ఆ జిల్లాల్లోని రైతుల వద్దకు వచ్చి పచ్చి ధాన్యాన్నే కొనుగోలు చేశారు. దీంతో ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ప్రారంభించాలనుకున్న ధాన్యం కొనుగోళ్లను ప్రభుత్వం మార్చి 25 నుంచే ప్రారంభించింది. పౌరసరఫరాల సంస్థకు చెందిన ధాన్యాన్ని గతంలో అక్రమంగా విక్రయించిన మిల్లర్లు... నిల్వల తనఖీకి ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వస్తుండటంతో రైతుల నుంచి అయినకాడికి కొనుగోలు చేసే కార్యక్రమం చేపట్టారు. దీంతో రైతులు కొనుగోలు కేంద్రాల వద్దకు ధాన్యం తీసుకురావడంలేదు. 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేయగా 40 లక్షల మెట్రిక్ టన్నులు కూడా వచ్చే అవకాశం లేదని అధికారులే అంటున్నారు.

హాస్టళ్లలో వసతులపై నివేదిక ఇవ్వండి

- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం
- పాఠశాలల్లోని పరిస్థితిపై కూడా..



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలు, వసతి గృహాల్లో మరుగుదొడ్లు సహా ఇతర మౌలిక వసతుల స్థితిగతులపై సమగ్ర నివేదిక అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. జూన్ 10 వరకు సమయం ఇస్తున్నామని స్పష్టం చేస్తూ, విచారణను వాయిదా వేసింది. ప్రభుత్వ హాస్టళ్లలో బాలల హక్కుల పరిరక్షణ కోసం జాతీయ కమిషన్-2018 నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు సౌకర్యాలు అందించడం లేదని, 10 మందికి ఓ బాత్రూమ్, ఏడుగురికి ఓ మరుగుదొడ్డి, 50 మందికో వార్డెన్ ఉండాలని చెబుతున్నా.. ఆ మేరకు సౌకర్యాలు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని పేర్కొంటూ హైదరాబాద్‌కు చెందిన కీర్తినేడి అఖిల్ శ్రీ గురుతేజ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినిపిస్తూ.. విద్యాహక్కు, బాలల హక్కుల వంటి పలు చట్టాలతో పాటు రాజ్యాంగ నిబంధనల ప్రకారం విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. అధికారులకు నోటీసులు జారీ చేస్తూ విచారణను వచ్చే నెలకు వాయిదా వేసింది.

సెలవుల్లోగా వసతులు కల్పిస్తారన్న ఏఏజీ

ఇన్ని రోజులూ విద్యార్థులు హాస్టళ్లలో ఉండటంతో నిర్మాణాలు చేపట్టడానికి ఇబ్బందులు ఉండేవని ఏఏజీ వాదించారు. ఇప్పుడు సెలవులు రావడంతో విద్యార్థులు హాస్టళ్ల నుంచి వెళ్లిపోయారని.. వేసవి సెలవులు జూన్ 11న ముగియనున్నాయని చెప్పారు. ఈ సెలవుల కాలంలో పాఠశాలలు, హాస్టళ్లలో వసతులు కల్పిస్తామని తెలియజేశారు. వాదనలు విన్న ధర్మాసనం.. నివేదిక అందజేయాలని ఆదేశిస్తూ, విచారణను జూన్ 10కి వాయిదా వేసింది.

పిటిషనర్లను భూమి నుంచి వెళ్లగొట్టొద్దు

- ఆర్ఆర్ఆర్ భూసేకరణలో ఎన్‌హెచ్‌ఏఐకి హైకోర్టు ఆదేశం
- ప్రక్రియను మాత్రం కొనసాగించుకోవచ్చని స్పష్టీకరణ



సాక్షి, హైదరాబాద్: రీజినల్ రింగ్ రోడ్(ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగం నిర్మాణంలో భూమి కోల్పోతున్న పిటిషనర్లను తాము తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు భూమి నుంచి వెళ్లగొట్టొద్దని నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్‌ఏఐ)ను హైకోర్టు ఆదేశించింది. అయితే ప్రక్రియను మాత్రం కొనసాగించుకోవచ్చని స్పష్టం చేసింది. ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ, తదుపరి విచారణను జూన్ 14కు వాయిదా వేసింది. ఆర్ఆర్ఆర్ నిర్మాణంలో భాగంగా మెదక్ జిల్లా తూప్రాన్ మండలం ఇస్లాంపూర్ గ్రామం సర్వే నంబర్ 375, 377, 336లోని 9.03 ఎకరాల భూమి మొత్తం పోతోందని శ్రీరాంరెడ్డి.. సిద్దిపేట్ జిల్లా గజ్వేల్ మండలం పాములపర్తి గ్రామంలో సర్వే నంబర్‌లో 263లో 14 ఎకరాలున్న కట్ట ఆరులప్ప హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు.

3ఏ, 3డీ నోటిఫికేషన్లు కొట్టివేయాలన్న పిటిషనర్లు

ఎన్‌హెచ్ 44, ఆర్ఆర్ఆర్ ఇంటర్ జంక్షన్‌ను దాదాపు 60 ఎకరాల్లో నిర్మిస్తున్నారు. దీని కోసం ఎన్‌హెచ్‌ఏఐ 2022, మే 25న 3ఏ నోటిఫికేషన్.. 2023, ఆగస్టు 8న 3డీ నోటిఫికేషన్ ఇచ్చింది. ఈ నోటిఫికేషన్లను వారు సవాల్ చేశారు. దాదాపు 4,704.25 ఎకరాల్లో ఎన్‌హెచ్‌ఏఐ ఆర్ఆర్ఆర్ నిర్మాణం చేపట్టనుంది. ఇందులో దాదాపు 4,315.33 ఎకరాల ప్రైవేట్ భూమిని సేకరిస్తున్నారు. అంటే మొత్తం భూ సేకరణలో ప్రైవేట్ భూమి వాటా 91.73 శాతం.. ప్రభుత్వ భూమి 5 శాతం.. అటవీ భూమి 3.27 శాతం. ప్రైవేట్ భూమి శాతాన్ని తగ్గించే అవకాశం ఉన్నా.. ప్రభుత్వం ఆ ఇతర మార్గాలవైపు దృష్టి సారించలేదని పిటిషనర్లు వివరించారు. ఈ పిటిషన్లపై న్యాయమూర్తి జస్టిస్ కాజా శరత్ విచారణ చేపట్టారు. పిటిషనర్ల తరఫున న్యాయవాది గొరారం రాజశేఖర్‌రెడ్డి వాదనలు వినిపించారు. జాతీయ రహదారుల చట్టాన్ని పాటించడంలో పలు వ్యత్యాసాలు ఉన్నందున 3ఏ, 3డీ నోటిఫికేషన్‌ను కొట్టివేయాలని కోరారు.

పునరావాసం చట్టం అమలుకాదన్న ఎన్‌హెచ్‌ఏఐ

భూమి కోల్పోతున్న వారిని గుర్తించాలని, 3డీ నోటిఫికేషన్ కంటే ముందే రీహ్యాబిటేషన్ అండ్ రీసెటిల్‌మెంట్(ఆర్ఆర్) ప్యాకేజీ అమలు చేయాల్సి ఉందన్నారు. రోడ్డు ప్రాజెక్టులకు భూసేకరణ ఉపశమనం, పునరావాస చట్టం 2013 అమలు కాదని, ఆర్ఆర్ ప్యాకేజీను అమలు చేయాల్సిన అవసరం లేదని ఎన్‌హెచ్‌ఏఐ న్యాయవాది వాదించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. కేంద్ర రోడ్డు రవాణా శాఖ కార్యదర్శి, ఎన్‌హెచ్‌ఏఐ తదితరులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణలోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది.

3 రోజులు తేలికపాటి వానలు!

▶ మొదటి పేజీ తరువాయి

దక్షిణ తమిళనాడు వరకు ఉపరితల ద్రోణి కొనసాగుతోందని.. దాని ప్రభావంతో మంగళ, బుధ, గురు వారాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో (గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో) కూడిన తేలిక పాటి వర్షాలు పడతాయని వాతావరణ శాఖ తెలిపింది. కొన్నిచోట్ల మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ముఖ్యంగా.. కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్ద పల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జన గామ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ జిల్లాల్లో మోస్తరు వానలు పడతాయని పేర్కొంది. వానలకు సంబంధించి ఈ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, సిరిసిల్ల జిల్లాలకు ఎల్లో అలర్ట్ ఇచ్చింది.

జల్లులు పడినా ఎండల మంటలే..



రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిశాయి. దానితో ఆదివారం రాత్రి వాతావరణం కాస్త చల్లబడింది. అయినా సోమవారం ఉష్ణోగ్రతలు అధికంగానే నమోదయ్యాయి. జగిత్యాల జిల్లా గుల్లకోట, అల్లిపూర్‌లో 46.8 డిగ్రీలు, పెద్దపల్లి జిల్లా ముత్తారంలో 46.4 డిగ్రీల అత్యధిక గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 23 ప్రాంతాల్లో 45 డిగ్రీలకుపైనే నమోదైంది. వచ్చే మూడు రోజులు కూడా గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే అధికంగానే నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

ప్రధాన కేంద్రాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలివీ..

నిజామాబాద్	44.5
మెదక్	44.0
ఆదిలాబాద్	43.8
ఖమ్మం	43.5
రామగుండం	43.4
మహబూబ్‌నగర్	43.1
హనుమకొండ	43.0
భద్రాచలం	42.6
హైదరాబాద్	41.9
హకీంపేట్	41.9
దుండిగల్	41.8
నల్లగొండ	41.0

'పది'లో మైనారిటీ పాఠశాల సత్తా

- వరుసగా నాలుగోసారి వంద శాతం ఉత్తీర్ణత
- ప్రారంభం నుంచే ఉత్తమ ఫలితాలు

బాల్కొండ: మండల కేంద్రంలోని తెలంగాణ మైనార్టీ వెల్ఫేర్ బాలికల పాఠశాల విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో సత్తా చాటుతున్నారు. గత నాలుగేళ్లుగా వంద శాతం ఉత్తీర్ణత సాధిస్తున్నారు. ప్రస్తుత సంవత్సరం కూడా నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు.

అందరూ పాసయ్యారు..

మండల కేంద్రంలో మైనారిటీ పాఠశాల 2015-16విద్యా సంవత్సరంతో ప్రారంభమైంది. పదో తరగతి 2020-21విద్యా సంవత్సరంతో ప్రారంభించారు. మొదటి బ్యాచ్‌లో 39 మంది విద్యార్థులు పదో తరగతిలో చదివారు. కరోనా కారణంగా పరీక్షలు నిర్వహించకుండానే ఫలితాలను వెల్లడించారు. అందులో నూరు శాతం ఉత్తీర్ణత సాధించడంతో పాటు 111 మంది 10 జీపీఏ సాధించారు. 2021-22 విద్యా సంవత్సరంలో 39 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అందరూ పాసయ్యారు. గరిష్టంగా ఒక్కొరికీ 9.8 జీపీఏ వచ్చింది. 2022-23 విద్యాసంవత్సరంలో 39 మంది విద్యార్థులు పరీక్ష రాసి అందరూ పాసయ్యారు. ఒక్కో విద్యార్థిని 10 జీపీఏ సాధించింది. 20223-24విద్యా సంవత్సరంలో 36 మంది పరీక్షలు రాయగా అందరూ పాసయ్యారు. అందులో ముగ్గురు విద్యార్థులు 10 జీపీఏ సాధించారు. పాఠశాలలో క్రమం తప్పకుండ వారంతపు పరీక్షలు, స్టడీ అవర్స్, క్రమశిక్షణతో కూడిన విద్యను అందంచడంతో ఉత్తమ ఫలితాలు సాధ్యమవుతున్నాయని చెప్పొచ్చు.



బాల్కొండలోని మైనారిటీ పాఠశాల

ఉపాధ్యాయుల సహకారంతోనే

- సాహితి, 10 జీపీఏ



ఉపాధ్యాయుల సహకారంతోనే పదో పరీక్షల్లో 10 జీపీఏ సాధించాను. నిత్యం పాఠశాలలో ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని చదివించారు. దీంతో పరీక్షలు సులభంగా రాయగలిగాను. ఆనందంగా ఉంది.

పరీక్షలు నిర్వహించారు

- సింధు, 10 జీపీఏ



పాఠశాలలో ప్రతి వారం చివరి రోజు పరీక్షలు నిర్వహించారు. గ్రూపు చర్చలు పెట్టి పరీక్షలంటే భయం లేకుండా చదివేలా ఉపాధ్యాయులు సిద్ధం చేశారు. దీంతో పరీక్షల సమయంలో భయం లేకుండ రాశాను.

ప్రత్యేక తరగతులతో..

- అభిత, 10 జీపీఏ



పాఠశాలలో ఉపాధ్యాయులు క్రమ తప్పకుండ స్టడీ అవర్స్ నిర్వహించారు. ప్రత్యేక తరగతులు కొనసాగాయి. దీంతో ఎక్కువ చదివే అవకాశం లభించింది. ఉపాధ్యాయులందరి సహకరాంతో సాధించాను.

సమష్టి కృషితో సాధ్యమైంది

- వాణి, ప్రిన్సిపల్



సమష్టి కృషితో ఉత్తమ ఫలితాలను సాధిస్తున్నాం. వరుసగా నాలుగేళ్ల నూరు శాతం ఉత్తీర్ణత సాధించడం గర్వంగా ఉంది. విద్యార్థుల తల్లిదండ్రుల సహకారం కూడా ఎంతో ఉంది.

కాడెద్దులు కనుమరుగు!

- పదేళ్లలో తగ్గిన పశువులు
- వ్యవసాయ యాంత్రీకరణతో మూలనపడిన ఎడ్లబండ్లు

బాల్కొండ: ఒకప్పుడు దుక్కి దున్నాలన్నా.. విత్తు వేయాలన్నా.. పండించిన పంట ఇంటికి చేరాలన్నా.. కాడెద్దులు.. ఎడ్లబండి కావాల్సిందే. వ్యవసాయంలో వాటి పాత్ర చాలా కీలకంగా ఉండేది. ఇప్పుడు యాంత్రీకరణ నేపథ్యంలో ట్రాక్టర్లు ఇతర పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. ఈ క్రమంలో ఎడ్లబండి జాడ ప్రశ్నార్థకంగా మారుతోంది. ఇక కాడెద్దులు చూద్దామన్నా కానరాని పరిస్థితి ఏర్పడుతోంది. కొన్ని గ్రామాల్లో ఒకటి.. రెండూ కనిపిస్తూ నాటి జ్ఞాపకాలను గుర్తు చేస్తున్నాయి. జోడెద్దులను ఎవరైనా కొనుగోలు చేయాలన్నా ధరలు ఆకాశన్నంటుతున్నాయి. గతంలో రైతుకు వెన్నుదన్నుగా నిలిచిన ఎడ్లు.. బండ్లు నేడు ఉనికిని కోల్పోతున్నాయి.

గతంలో ప్రతి రైతు ఇంటి వద్ద కాడెద్దులు, ఎడ్లబండి దర్శనమిచ్చేవి. కానీ ప్రస్తుతం పరిస్థితి కనిపించడం లేదు. ట్రాక్టర్ల రాకతో కాడెద్దులు, బండ్లు కనుమరుగయ్యాయి. ప్రస్తుతం గ్రామానికి ఏ ఒక్కరో ఇద్దరో రైతుల వద్ద మాత్రమే ఎద్దులు కనిపిస్తున్నాయి. ఇక ఎడ్లబండ్లు మచ్చుకైనా కానరావడం లేదు. మారుమూల గ్రామాల్లో ఉన్న ఒకటి రెండు బండ్లు నాటి జ్ఞాపకాలకు గుర్తులుగా దర్శనమిస్తున్నాయి.



దూదిగాంలో ఎడ్ల బండిపై వెళ్తున్న రైతు

రైతుకు అండగా..

నాడు వ్యవసాయంలో కాడెద్దులు, ఎడ్లబండి ముఖ్య భూమికను పోషించేవి. సాగులో రైతుకు అండగా నిలిచేవి. ఏటా పంటల దుక్కులు దున్నేందుకు, విత్తనాలు వేసేందుకు కాడెద్దులు ఉండాల్సిందే. అసలు ఎద్దులు, మడక, ఎడ్లబండి లేని రైతు కుటుంబాలు ఉండేవి కాదు. ఇప్పటికీ వీటికి డిమాండ్ ఉన్నా మారిన వ్యవసాయ పరిస్థితులతో వీటి ఉనికి కరువవుతోంది.

పోషించలేకనే..



కాడేడ్లను పెంచి పోషించలేకనే ఉన్న ఎడ్లను అమ్ముకున్నాం. ఎడ్లబండ్లపై తోటలకు వెళ్లినప్పుడు చిల్లి గవ్వ ఖర్చు లేకుండా కూలీలను తోటలకు తీసుకెళ్లే వాళ్లం. కానీ ఇప్పుడు ఆటోలు, ట్రాక్టర్లు పెట్టి తరలిస్తున్నాం. ఎడ్లబండ్ల సందడి వేరే ఉండేది.

– ముత్యంరెడ్డి, రైతు, నాగంపేట్

పనులు వేగంగా కావాలని..



పనులు వేగంగా చేపట్టాలని ట్రాక్టర్లతో చేపడుతున్నాం. దీంతో ఎడ్ల అవసరం లేకుండ పోతోంది. ఎడ్లు లేక పోవడంతో ఎడ్ల బండ్లను కూడా అమ్ముకున్నాం. దీంతో గ్రామాల్లో ఎడ్ల బండ్లు లేకుండ పోయాయి. పాత కాలంలోనే సాగు విధానం బాగుండేది.

– నద్ముడ నర్సయ్య, రైతు, రెంజర్ల

హరితహారం చెట్ల నరికివేత

- ముందుచూపు లేని ప్రభుత్వ అధికారులు
- విద్యుత్ వైర్ల కింద మొక్కలు నాటిన వైనం
- తీరా అవి చెట్లుగా మారే సమయానికి అడ్డుగా వస్తున్నాయని నరికేస్తున్న విద్యుత్ శాఖాధికారులు



పొయ్యిలో కట్టెలుగా మారిన హరితహారం మొక్కలు

భీమ్‌గల్: పచ్చదనాన్ని పెంపొందించేందుకు గత ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి హరితహారం కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా ప్రతి ఏడాది వానాకాలంలో ప్రజలందరిని భాగస్వాములను చేస్తూ, అధికారులు, ప్రజాప్రతినిధులు అందరు కలిసి ప్రభుత్వ, ప్రైవేటు ఖాళీ స్థలాలతో పాటు, పొలాలు, చెరువు గట్లపై అట్టహాసంగా మొక్కలు నాటారు. తీరా అవి పెరిగి పెద్దగయ్యేసరికి విద్యుత్ తీగలకు అడ్డు వస్తున్నాయనే కారణంతో విద్యుత్ శాఖ అధికారులు అడ్డూ అదుపూ నరికేస్తున్నారు. భీమ్‌గల్ మండలంలోని పలు గ్రామాల్లో పదేళ్ల క్రితం నాటిన మొక్కలు పెరిగి పెద్దవి కాగా విద్యుత్ అధికారులు తీగలకు అడ్డువస్తున్నాయని నరికేస్తున్నారు. గతంలో ఫారెస్ట్ అధికారులు, పంచాయతీ అధికారులు గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా మొక్కలను నాటించారు. వాటిలో దాదాపు 80 శాతం మొక్కలు ఏపుగా పెరిగాయి. గతంలో రోడ్లకు ఇరువైపులా ఉన్న చెట్లను చాలా సార్లు నరికేశారు. కొమ్మలను నరికితే పోయేదానికి ఇష్టానుసారంగా చెట్ల మొదళ్ల నుంచి నరుకుతూ చేతులు దులుపుకుంటున్నారు.

కన్నెత్తి చూడని జీపీ అధికారులు

గ్రామాల్లో సంవత్సరాల నుంచి పెంచిన హరితహారం చెట్లను యథేచ్ఛగా నరికేస్తున్నా ఎంపీడీవో, పంచాయతీ సెక్రెటరీలు అటు వైపు కన్నెత్తి చూడటం లేదు. విద్యుత్ శాఖ అధికారుల ఆదేశంతో చిగురించేందుకు వీలు లేకుండా మొదళ్ల వరకు నరికేస్తున్నారు. తీగలకు తగిలే కొమ్మలను తొలగించకుండా మొత్తం చెట్లను నరికివేస్తుంటే అధికారులు పట్టించుకోవడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

పట్టించుకోని అటవీ శాఖాధికారులు

పెద్ద ఎత్తున రోడ్లకు ఇరువైపులా చెట్లు నరికివేతకు గురవుతున్నా ఇటు పంచాయతీ అధికారులతో పాటు అటు అటవీ శాఖాధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. సొంత స్థలాల్లో పెరిగిన చెట్లను తొలగించడానికి అనుమతుల పేరుతో ఇబ్బందులకు గురి చేసే అధికారులు.. ఎంతో ప్రజాధనం వెచ్చించి హరితహారంలో భాగంగా పెంచిన చెట్లను ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టం వచ్చినట్లు నరికేస్తున్నా కనీసం చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి చెట్ల నరికివేతకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు. చెట్లు నరికివేతకు గురవుతున్న విషయంపై ఎంపీడీవోను వివరణ కోరగా చర్యలు తీసుకుంటామని, అవసరమైతే కేసులు నమోదు చేయిస్తామని తెలిపారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

- మోచేతికి బెల్లం పెట్టి చోద్యం చూస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి
- ఎన్నికల ప్రచారంలో బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి



నిజాంసాగర్‌లో మాట్లాడుతున్న పోచారం

నిజాంసాగర్: అధికారంలోకి వచ్చిన వందరోజుల్లోనే ఆరు హామీలను అమలు చేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన రేవంత్‌రెడ్డి.. కుర్చీ ఎక్కిన తర్వాత ప్రజల మోచేతికి బెల్లం పెట్టారని బాన్సువాడ ఎమ్మెల్యే పోచా రం శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. సోమవారం నిజాంసాగర్‌లో నిజాంసాగర్, మహమ్మద్‌నగర్ మండలాల కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పంట రుణాన్ని మాఫీ చేయలేదని, వరికి క్వింటాలుకు రూ. 500 బోనస్ ఇస్తానని చెప్పి మాట తప్పిందని విమర్శించారు. హామీలు నిలబెట్టుకోలేని కాంగ్రెస్‌కు ఓట్లు ఎందుకు వేయాలని ప్రశ్నించారు. హామీల అమలు విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దేవుళ్లపైన కాకుండా తన కుటుంబ సభ్యుల మీద ఒట్లు పెట్టుకోవాలన్నారు.

పదేళ్లు ఏం పని చేశావని ఓట్లు వేయాలని బీబీ పాటిల్‌ను పోచారం ప్రశ్నించారు. ఉద్దెర పనులు చేసేటోళ్లు కాబట్టి పార్టీలు మారి కోట్లు సంపాదిస్తున్నారని ఆరోపించారు. ఓటమి భయంతో పాటు కేసీఆర్ టికెట్టు ఇవ్వడని తెలిసి బీబీ పాటిల్ రాత్రికి రాత్రి బీజేపీలో చేరారని, దీంతో బీఆర్ఎస్‌కు పీడ తొలగిందని పేర్కొన్నారు. హామీలు అమలు చేసిన, అభివృద్ధి పనులు చేసిన బీఆర్ఎస్‌కే ఓట్లు వేయాలని కోరారు. సమావేశంలో జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే, జెడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు, పార్టీ నాయకులు సాదుల సత్యనారాయణ, దుర్గారెడ్డి, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.